అటకెక్కిన పర్యవేక్షణ..!

- ఎన్నికల సమయంలో... అక్రమ నిర్మాణాల దందా
- సర్కారు ఆదాయానికి భారీగా గండి
- జీపీలు.. మున్సిపాలిటీల్లో యథేచ్ఛగా కట్టడాలు
- జీహెచ్ఎంసీ మున్సిపల్ సర్కిళ్లలోనూ పార్కుల కబ్జా



సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారు పురపాలక సంఘాలతోపాటు గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణాల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఎక్కడ చూసినా బహుళ అంతస్తుల జోరు కనిపిస్తోంది. చిన్న వీధుల్లో కూడా మూడు, నాలుగు అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. కనీసం అగ్నిమాపక యంత్రాలు తిరిగేలా స్థలాలు ఉండాలనే నిబంధనను ఆయా ఇంటి ఓనర్లు పట్టించుకోవడం లేదు. పైగా ఇంటికి అనుకుని కొత్త భవన నిర్మాణాలు చేపడుతున్నారు.

అనుమతులకు విరుద్ధంగా

శివారు పురపాలికలు, జీపీల్లో అనుమతులకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణాలు అధికమయ్యాయి. ఒకటి, రెండు అంతస్తులకు అనుమతులు తీసుకుని.. అదనంగా రెండు, మూడు అంతస్తులు నిర్మిస్తున్నారు. మరికొందరు అనుమతులే లేకుండా ప్రజాప్రతినిధుల అండతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

- గత కొన్నేళ్లుగా భవన నిర్మాణాలపై అధికార యంత్రాంగం పట్టనట్లుగా వ్యవహరించగా, అసెంబ్లీ ఎన్నికల సమయంలో...సరైన పర్యవేక్షణ చేపట్టకుండా గాలికి వదిలేశారు. ఇదే అదనుగా అక్రమార్కులు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టారు. టీఎస్ బీపాస్ విధానం వచ్చినప్పటి నుంచి అనుమతుల దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరించడం, ఫిర్యాదులు వస్తే టాస్క్ ఫోర్స్‌కు అప్పగించడం తప్ప.. క్షేత్రస్థాయిలో ఎన్ని అంతస్తులకు అనుమతి ఉంది? పార్కింగ్, సెల్లార్, ఏ అవసరాలకు వినియోగిస్తున్నారనే అంశాలపై తనిఖీలు చేపట్టడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే భవనాలను మొదట్లోనే కట్టడి చేయకపోవడంతో ఫిర్యాదులు కూడా పెరిగిపోతున్నాయి. ఇప్పటికైనా నగర, పురపాలిక పట్టణ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు తీసుకోవడంతో పాటు జాగ్రత్తలపై అవగాహన కల్పించాల్సిన అవసరముంది.

ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి..

- ఆక్రమ కట్టడాలపై జిల్లా యంత్రాంగం సీరియస్‌గా ఉన్నా...క్షేత్ర స్థాయిలో ఆశించిన ఫలితం రాకపోవటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)లో అందిన దరఖాస్తులే అందుకు నిదర్శనం.నగర శివారుల్లో ఇష్టానుసారంగా వెలుస్తున్న ఆక్రమ కట్టడాలు, లేఅవుట్లతోపాటు ,రోడ్లు, పార్కులను కబ్జా చేసి నిర్మిస్తున్న భవనాలు, బహుళ అంతస్తులు, ఇండిపెండెంట్ ఇళ్ల విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్న పురపాలికలు, జీపీల్లోని పలువురు ఉద్యోగులు, సిబ్బంది తీరుపై సీరియస్‌గా ఉన్న అధికార యంత్రాంగం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను రంగంలోకి దింపాలని భావిస్తోంది.
- బోడుప్పల్ ,పీర్జాదిగూడ, మేడ్చల్ ,జవహర్‌నగర్, నిజాంపేట్, కొంపల్లి, దుండిగల్, తూముకుంట , దమ్మాయిగూడ , నాగారం, ఘట్కేసర్, పోచారం, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీల్లో అక్రమ నిర్మాణాలు ,లేఅవుట్లు ,ఇండిపెండెంట్ ఇళ్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. కొత్త ప్రభుత్వం ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేసి స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారిస్తోంది.చేతివాటం ప్రదర్శిస్తున్న ఉద్యోగులు, సిబ్బందిపై నిఘా ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. అక్రమ కట్టడాలపై ఇటీవల ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌తోపాటు కలెక్టర్, జిల్లా సంబంధిత అధికారులకు ఫిర్యాదులు అందుతుండటంతో ఉన్నతాధికార యంత్రాంగం సీరియస్‌గా ఉంది.

గతంలో గుర్తించినవి ఇవీ

మేడ్చల్ జిల్లాలో పురపాలక సంఘాలు ,గ్రామ పంచాయతీల్లో గుర్తించిన అక్రమ కట్టడాలు, లేఅవుట్లు 3,643 ఉండగా, ఘట్కేసర్ మండలంలో 656, దుండిగల్‌లో 1950, కీసరలో 650 ,శామీర్‌పేట్‌లో 191, మేడ్చల్ మండలంలో 196 ఉన్నట్లు తెలుస్తుంది. నాగారం పట్టణంలో 12 అక్రమ లే ఔట్లు ఉండగా, దమ్మాయిగూడలో ఏడు, మేడ్చల్‌లో 10 ,నిజాంపేట్‌లో20, ,కొంపెల్లిలో11, దుండిగల్‌లో 12,, తూముకుంటలో15 ,పోచారంలో 12, ఘట్కేసర్‌లో ఎనిమిది ఉన్నట్లు తెలుస్తోంది. ఇవన్నీ ఇటీవల ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సమాచారం ఆధారంగా వెలుగులోకి రాగా, ఎన్నికల సమయంలో కొనసాగిన అక్రమ భవన నిర్మాణాలపై పురపాలక సంఘాలు ,జీపీల నుంచి నివేదికలు తెప్పించుకోవటంతోపాటు వేగుల ద్వారా సమాచారాన్ని సేకరిస్తోంది.

జీహెచ్ఎంసీ మున్సిపల్ సర్కిళ్లల్లో ఇలా..

మేడ్చల్ జిల్లా పరిధిలోని జీహెచ్ఎంసీ మున్సిపల్ సర్కిళ్లలోని పార్కులు ,రోడ్లు ఆక్రమించి నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై కూడా ఆరా తీస్తున్నారు. ఉప్పల్ సర్కిల్‌లో 1989 చదరపు గజాల స్థలం ,కాప్రా సర్కిల్‌లో 194 చదరపు గజాలు,,మల్కాజిగిరి సర్కిల్‌లో 36 చదరపు గజాలు, మూసాపేట్‌లో 20, కూకట్‌పల్లిలో 455, కుత్బుల్లాపూర్‌లో 62, గాజుల రామారంలో 198 , అల్వాల్ సర్కిల్‌లో 155 చదరపు గజాల స్థలం ఆక్రమణకు గురైనట్లు గుర్తించిన యంత్రాంగం వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు సమాచారం.

ఎన్ఆర్‌సీఈలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో కళాశాల పాల్గొన్న యాజమాన్యం, అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎన్ఆర్‌సీఈ కళాశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే క్రిస్మస్ పండగను ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు ఎంతో పవిత్రంగా భావిస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మోహన్‌బాబు, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మహవీర్ ఇంటర్‌నేషనల్, తలసేమియా సంస్థ ఆధ్వర్యంలో కళాశాలలోని సెమినార్ హాల్‌లో నిర్వహించిన శిబిరంలో ఎన్ఎస్ఎస్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవిరెడ్డి, డైరెక్టర్ సరోజా రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, ఎన్ఎస్ఎస్ పీవో రాజేశ్ పాల్గొన్నారు.

సాంకేతికతపై పట్టు సాధించాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఘట్‌కేసర్: విద్యార్థులు అత్యాధునిక సాంకేతిక విషయాలపై ప్రాక్టికల్స్ నాలెడ్జ్ పెంపొందించుకోవడానికి, అందుకు విరివిగా అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొనాలని అనురాగ్ యూనివర్సిటీ డీన్ జి విష్ణుమూర్తి అన్నారు. శుక్రవారం వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం, స్ప్రింజర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఐసీఏసీఐఐ-2023లో భాగంగా విద్యార్థులకు రెండు రోజుల ప్రీ కాన్ఫరెన్స్ వర్క్‌షాప్ ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బిగ్ ఇమేజ్ డేటా ప్రాసెసింగ్ యూజింగ్ డీప్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ సర్వీసెస్, సైబర్ సెక్యూరిటీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ శ్రీదేవి, కోకన్వీనర్ బాలకృష్ణ, సమన్వయ కర్తలు శివప్రసాద్, బాలరాజు, ప్రభాకర్‌రాజు, ఉజ్వల, శ్యామ్‌ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జాబ్ మేళా

అల్వాల్: మేడ్చల్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యవకులకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 16న శనివారం ఉదయం జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలోని రూమ్ నెంబర్-9లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.వై. నిర్మల తెలిపారు. రిలయన్స్ జియో హైదరాబాద్ ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. జియో పాయింట్ అసిస్టెంట్ మేనేజర్, ఎంటర్‌ప్రైజ్ సేల్స్ ఆఫీసర్స్, జియో డిజిటల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఇంటర్, డిప్లమోతో పాటు డిగ్రీ చదివి ఉండాలన్నారు. ఆసక్తిగల యువతీ యువకులు www.nic.gov,in లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 7386809422 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్

హబ్సిగూడ: భారత మాజీ ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం హబ్సిగూడలోని ఆయన విగ్రహానికి హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్, రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిని, దూరదృష్టితో కూడిన రాజనీతిజ్ఞతను, అసాధారణమైన అంకితభావాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్జాతీయ సహజయోగ యువశక్తి సమ్మేళనం

మేడిపల్లి: అంతర్జాతీయ సహజయోగ యువశక్తి సమ్మేళనం ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్, పలని కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సహజయోగ రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరికృష్ణ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

మహిళపై దాడి, గొలుసు చోరీ

మల్కాజిగిరి: ఓ మహిళ పై గుర్తుతెలియని యువకులు దాడి చేసి బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ జగన్నాథ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..పీవీఎన్ కాలనీకి చెందిన కవిత గురువారం రాత్రి తన కుమారుడితో కలిసి బైక్‌పై వస్తుండగా గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వారిపై దాడి చేసి ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శివసాయినగర్ కాలనీ అధ్యక్షుడిగా పద్మారెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, శివసాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎంపల్లి పద్మారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన ఎన్నికలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కొండగళ్ల అశోక్, ఉపాధ్యక్షుడిగా కాసుల సురేష్‌గౌడ్, నారా నరసింహులు, కోశాధికారిగా సరికొండ రమేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పద్మారెడ్డి మాట్లాడుతూ మరోమారు కాలనీ అధ్యక్షుడిగా ఎన్నుకున్న కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని కాలనీవాసులు ఘనంగా సత్కరించారు.

ఘనంగా జన జాతీయ గౌరవ దివస్

ఉప్పల్: విద్య, వ్యవసాయం, ఆరోగ్యం తదితర రంగాల్లో గిరిజనుల అభివృద్ధికి మరిన్ని శాస్త్ర సాంకేతిక అంశాలు అవసరమని ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ డా అశోక్ కుమార్ అన్నారు. సీఎస్ఐఆర్,ఎన్‌జీఆర్ఐ ఆధ్వర్యంలో భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా శుక్రవారం 'జన జాతీయ గౌరవ దివస్' నిర్వహించారు. పరిశోధన అభివృద్ధి తదితర కార్యకలాపాలపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు.

శుభాకాంక్షలు



అల్వాల్: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం అల్వాల్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు వారి నివాసాల్లో లిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీశైల ఆలయ ప్రసాదాన్ని అందజేశారు. మంత్రులను కలిసి వారిలో అల్వాల్ సొసైటీ మాజీ చైర్మన్ తోట ధర్మంత్‌రెడ్డి, తూంకుంట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జగదీష్‌గౌడ్, సీనియర్ నాయకులు బౌరంపేట్ మధుసూదన్‌రెడ్డి, వీరన్న, భోజిరెడ్డి, చింతల మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

మేడ్చల్: గత ప్రభుత్వ హయాంలో మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శనివారం ఎమ్మెల్యే మల్లారెడ్డి పంపిణీ చేస్తారని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 22 మంది కి చెక్కులు మంజూరయ్యాయన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సాయంత్రం జరిగే సమావేశంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తారన్నారు.

వాహనాల వేలం

మేడ్చల్: అక్రమంగా మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలను శనివారం మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో వేలం వేస్తున్నట్లు సీఐ నవనీత తెలిపారు. రెండు ద్విచక్రవాహనాలను వేలం వేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆసక్తిగల వారు లోబడి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

పరామర్శ ..

కుషాయిగూడ: యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను గురువారం రాత్రి మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

కొబ్బరి కాయల దుకాణ నిర్వహణకు వేలం

మల్కాజిగిరి: మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానం ఆవరణలో కొబ్బరి కాయలు, పూజా ద్రవ్యాలు విక్రయించేందుకు గాను శుక్రవారం దేవాదాయ శాఖ అధికారిణి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. సంవత్సర కాలం దుకాణం నిర్వహించుకోవడానికి రూ 2,97,000/- సుంకరి మహేష్ వేలం దక్కించుకున్నట్లు ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.

అప్రమత్తతే రక్ష

మల్కాజిగిరి: బాలికలు,మహిళలు అన్ని రంగాల్లో ముందుండటమే కాకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ప్రియాంక అన్నారు.బాలికల ప్రాథమిక పాఠశాలలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు హక్కులు , ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్మిక చట్టాలు, పోక్సో చట్టాలు, 100,181,1098,14567,155326 టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించారు.

ఉద్యమకారులను గుర్తుంచుకుంటా

మల్కాజిగిరి: తన విజయంలో కీలకంగా పనిచేసిన ఉద్యమకారులను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఉద్యమ సమయంలో మల్కాజిగిరి జేఏసీ చైర్మన్‌గా పనిచేసిన వెంకన్న ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యమకారులు సమన్వయంతో పనిచేయడానికి కృషి చేసిన వెంకన్నను ఎమ్మెల్యే అభినందించారు. భవిష్యత్తులో వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

అభినందనలు

మల్లాపూర్: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహను శుక్రవారం నాచారం ప్రాంతానికి చెందిన పలువురు నేతలు కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఆర్ మోహన్, ప్రమోద్ మహరాజ్, డాక్టర్ చీమా శ్రీనివాస్, ఇంటలెక్చువల్లీ ఫోరం అధ్యక్షులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి మల్లారెడ్డి భూములపై సమగ్ర విచారణ జరిపించాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

శామీర్‌పేట్: మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆస్తులపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం మేడ్చల్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి మండలం, కేశవరం గ్రామపరిధిలో గల 33, 34, 35 నంబర్లలోని గిరిజనులకు చెందిన 47. 18 ఎకరాల భూమిని ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆక్రమించాడనే ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం సీపీఎం జిల్లా కమిటీ సదరు స్థలాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం మాట్లాడుతూ...మల్లారెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని కుత్బుల్లాపూర్, మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి, కీసర మండలాల్లోని ప్రభుత్వ, శిఖం భూములను కబ్జా చేశాడన్నారు. అసైన్డ్ భూముల చట్టాన్ని తుంగలో తొక్కి, సదరు భూములను కొనుగోలు చేశాడని ఆరోపించారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడిన మల్లారెడ్డిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు శ్రీరామ్ నాయక్, శోభన్, చంద్రశేఖర్, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కీసర: మండలకేంద్రమైన కీసరలో నూతనంగా నిర్మించిన శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో విగ్రహప్రతిష్ఠా మహోత్సవ పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. గోపూజ, అవాహిత దేవతపూజ, చండీహోమం, నవగ్రహ హోమం, మన్యుసూక్తహోమం, ధాన్యాధివాసం, అయ్యప్పస్వామి హోమాలు, దేవత విగ్రహాలకు మహాస్నపనం (విగ్రహాలశుద్ధి) తదితర పూజలు కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధురి, ఉపసర్పంచ్ తటాకం లక్ష్మన్, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్ రెడ్డి, గురుస్వాములు నల్లబాల్‌రెడ్డి, బొడుసురమేష్ యాదవ్, మొర్గుయాదగిరి, అయ్యప్ప దీక్షదారులు గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఐటీలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌ఐటీ కళాశాలలో శుక్రవారం ఇండికాన్-2023 అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఐఈఈఈ ఇండియా కౌన్సిల్ ఫ్లాగ్‌షిప్ కాన్ఫరెన్స్‌ను హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో సీఎంఆర్‌ఐటీలో నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ సదస్సును ఢిల్లీలోని నేషనల్ సూపర్ కంప్యూటింగ్ మిషన్ డైరెక్టర్ హేమంత్ దర్బారీ, ఐఈఈఈ ఇండియా కౌన్సిల్ చైర్ దేబబ్రత దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు సూపర్ కంప్యూటింగ్ , ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్స్ కు భవిష్యత్తుపై వివరించారు. సదస్సులో ఐఐఐటీ హైదరాబాద్ ప్రతినిధులు టీపీసీ నివేదికను సమర్పించారు. విజయలత, అమిత్ కుమార్, అతుల్ నేగి, సత్యనారాయణ, ముంబై మాస్కో, అజయ్ చౌరాసియా, గోపాల్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి, జంగారెడ్డి, ప్రిన్సిపాల్‌లు, శాస్త్రవేత్తలు, పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు.

విద్యార్థినులు క్రీడల్లో రాణించాలి



మేడ్చల్‌రూరల్: విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్ శాలినీ రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో టెక్‌ట్రోఫీ-2023 పేరిట ఇంటర్ కాలేజీ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఎమ్మార్‌జీఐ డైరెక్టర్ శాలినీరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత స్పోర్ట్స్ మీట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వం, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. స్పోర్ట్స్ మీట్‌లో రాష్ట్రంలోని పలు యూనివర్సిటీలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ, త్రోబాల్ టేబుల్ టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, డీన్స్, అధ్యాపకులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణానికి పరిమితులు విధించాలి



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

మేడ్చల్: మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై పరిమితులు విధించాలని ఆటో డ్రైవర్లు అన్నారు. ఉచిత ప్రయాణంపై ఆంక్షలు విధించాలని కోరుతూ శుక్రవారం మేడ్చల్ ఆటోస్టాండ్‌లలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లు వ్యాపారాలు లేక రోడ్డున పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంక్షలు విధించి అన్ని వర్గాల వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు



పోచారం: అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టారు. కుక్కల బెడదతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులు అందడంతో నియంత్రణ చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా బ్లూక్రాస్ సహకారంతో మున్సిపల్ సిబ్బంది కుక్కలను పట్టుకుని ఆపరేషన్లు చేశారు.

వల్లభాయ్ పటేల్‌కు నివాళి



మేడ్చల్: ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని పురస్కరించుకుని వివిధ పార్టీల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 4వ వార్డులోని కిష్టాపూర్ అర్చన కాలనీలో పటేల్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గణేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రేందాస్ తదితరులు పాల్గొన్నారు.